# అమ్మకానికో అబ్బాయి

ఆరోజు ఇవ్వవలసిన మార్కెటింగ్ ప్రెజంటేషన్‌ని ఆఖరిసారిగా మళ్ళీ ఒక్కసారి చూసుకుని, అంతా బాగానేవుందని నిర్ధారించుకున్నాక, లేచి మళ్ళీ కాఫీ కప్పు నింపుకోటానికి బ్రేక్‌రూమ్‌కి వెళ్ళాను.

"ఇప్పుడే ఫ్రెష్ కాఫీ చేశాను కావాలా?" అంటూనే నా చేతిలోని కప్పు తీసుకుని నిండుగా నింపి, నిండుగా నవ్వింది బ్రెండా. బ్రెండా మా డిపార్ట్‌మెంట్‌లోనే నా దగ్గరే పనిచేస్తుంది. ఆరడుగుల పొడుగు, బ్లాండ్ జుట్టూ, ఎప్పుడూ నవ్వుతూ చాల అందంగావుంటుంది.

నేనుకూడా నవ్వి వెనక్కి తిరుగుతుండగా అంది, "రాత్రి టీవీలో సిక్స్టీ మినిట్స్ షో చూశావా?" అని.

"లేదు. రాత్రంతా ఏవో వ్రాసుకుంటూ కూర్చున్నాను" అన్నాను.

"రాత్రి మీ ఇండియాలో పెళ్ళిళ్ళ గురించి వచ్చింది ఆ షో. అక్కడ అమ్మాయిలకి పెళ్ళిళ్ళు కావాలంటే తలకు మించిన డబ్బులివ్వాలిటగదా!" అంది ఇద్దరం మా సీట్ల దగ్గరికి వస్తుండగా.

ఇటువంటి షోలు టీవీలోనూ వార్తలు పేపర్‌లోనూ వచ్చినప్పుడు ఎవరో అమెరికన్ మిత్రులు చెప్పటం మామూలే. చాలమంది నాతో చెప్పేది అపహేళనగానూ చిన్న బుచ్చటం కోసమూ కాకుండా, నిజాయితీగా నిజం తెలుసుకోవటం కోసం. అందుకని నన్ను వాళ్ళు ఇరుకున పెడుతుంటారు. అవన్నీ నిజాలే కనుక వాళ్ళతో కాదని చెప్పలేం, అబద్ధాలని వాదన పెట్టుకోలేం. వేరే విధంగా సమర్ధించుకోలేం కూడా. అందుకే ఏమీ అనకుండా నవ్వి వూరుకున్నాను.

"ఢిల్లీలో అనుకుంటాను. ఒకమ్మాయిని పెళ్ళి ముందర కట్నం కోసం వేధించారుట. ఆ అమ్మాయి పోలీసులని పిలిచి, వాళ్ళని పట్టించిందిట. అసలు పెళ్ళి చేసుకోవటానికి డబ్బులివ్వటమేమిటి? అమ్మాయీ అబ్బాయీ కలిసి పెళ్ళిచేసుకుంటున్నప్పుడు ఈ కట్నం అమ్మాయే ఎందుకివ్వాలి? అబ్బాయే ఎందుకు తీసుకోవాలి? ఖర్చులు ఇక్కడిలాగా ఇద్దరూ కలిసి పంచుకోరా?" అని అడిగింది

మంచి ప్రశ్నే. అబద్ధం చెప్పకుండా జవాబు ఎలా చెప్పాలా అనుకుంటుండగానే, బ్రెండాకి ఫోన్ కాల్ వచ్చింది. తర్వాత ఇద్దరం ఆఫీసులో బిజీ అయిపోవటంతో మళ్ళీ ఆ విషయం ప్రస్తావనకి రాలేదు.

ఆరోజు ఇంటికి వస్తున్నప్పుడు ఆ విషయమే ఆలోచిస్తున్నాను. అసలు ఆడవాళ్ళే ఎందుకివ్వాలి. మగవాళ్ళెందుకు ఇవ్వకూడదు? సభ్య ప్రపంచంలో కట్నాలు ఏ దేశంలోనూ ఎవరూ ఇవ్వరు. మరి మన దేశంలో ఎందుకు వున్నదీ దౌర్భాగ్యం? నాలుగేళ్ళ క్రితం అనుకుంటాను. అట్లాంటానించీ నా మేనల్లుడి

ఆధ్వర్యంలో కొంతమంది ఔత్సాహికులు, గురజాడ అప్పారావుగారి కన్యాశుల్కం నాటకం వేద్దామని ఉత్సాహపడ్డారు. గురజాడవారి నాటికలో మాటలని యథాతథంగా అలాగే వుంచేసి అమెరికా ప్రేక్షకుల కోసం ఒకటిన్నర గంటలకి కుదించారు. రోజువారీ ఉద్యోగాల సందడిలో ఎలాగో సమయం సంపాదించుకుని, ఎంతో కష్టపడి ఆ నాటికని అట్లాంటాలో ప్రదర్శించారు. అది ఎంత గొప్పగా వుందంటే, తరువాత డల్లాస్ హ్యూస్టన్‌లాటి ఇతర నగరాల్లో కూడా, చాల చోట్ల మన తెలుగువాళ్ళు అడిగి ప్రదర్శనలు ఇప్పించుకున్నారు. దాని కోసం రానూపోనూ నాలుగొందల మైళ్ళు డ్రైవ్ చేసుకుని డల్లాస్ వెళ్ళి చూసివచ్చాం. తిరిగే కాలూ తిట్టే నోరూ లాగానే, వ్రాసే చెయ్యీ ఊరుకోదు కనుక, దాని మీద ఒక రివ్యూ వ్రాసి ఇంటర్‌నెట్లో పోస్ట్ చేశాను.

మన భావాలు తెలుగు ఇంటర్‌నెట్లో పెడితే, తల పులి నోట్లో పెట్టినట్టే అని అప్పుడే తెలిసింది. కొంతమంది మౌనమే అనంగీకారమని నిశ్శబ్దంగా నీరాజనం ఇస్తే, మరి కొంతమంది నాటకం చూడకుండానే చూసిన వాళ్ళని చివాట్లు పెట్టారు. వాటిల్లో ముఖ్యంగా ఒకాయన "అసలు కన్యాశుల్కం కథకి ఈ రోజుల్లో అర్థం లేదు. అసలు అది ఒక సమస్యే కాదిప్పుడు. దాని గోల మన కేల" అని కేకలేశాడు. దానికి నా జవాబుకూడా ఇచ్చాను. ఆ రోజుల్లో కన్యాశుల్కం పేరుతో మగవాడు డబ్బు ఇచ్చేవాడు. ఎంత ముసలివాడైనా డబ్బులిచ్చి కొనుక్కుంటున్నాడు కాబట్టి పడుచు పిల్లల్ని పసికందుల్ని పెళ్ళిచేసుకునేవాడు. జీవితంలో సుఖాలని అనుభవించే లోపలే తను పరమపదించి, ఎన్నో పడతుల జీవితాల్ని పరమేశ్వర ప్రసాదం చేశాడు. కాలక్రమేణా ఆ కన్యాశుల్కం అనే దురాచారం కట్నమనే పెనుభూతంగామారింది. దానివల్ల ఆడపిల్లలు కట్నం ఇచ్చి మగవారిని కొనుక్కోవాలి కదా మరి? అంటే ముసలి ఆడవారు, పడుచు కుర్రాళ్ళని కొనుక్కుని పెళ్ళిచేసుకోవటం జరగలేదు. అంతేకాదు, ఇటు యథాశక్తి డబ్బులివ్వటమే కాకుండా, ఆడపిల్లలు తల్లిదండ్రుల గుండెల మీద కుంపటిగా తయారయ్యారు. ఇక్కడ విచిత్రమేమిటంటే, బజారులో వేలంపాట పాడేది కొనుక్కోటానికి కాదు అమ్ముడు పోవటానికి. అలా ఏకు మేకైన ఈ పెళ్ళిళ్ళ వ్యాపారంలో తలకు మించిన కట్నాలివ్వలేక తలమునకలయారు. అవుతున్నారు. ఎంతో కష్టపడి సంపాదించుకున్న ఇళ్ళూ పొలాలూ, తమ తలలతో పాటూ తాకట్టు పెట్టుకుని, తమ రిటైర్‌మెంట్ పెన్షన్ భవిష్యత్తుని పెరటి బావిలోపాలేశారు. మరి అటు ఆ కన్యాశుల్కం కానీ ఇటు ఈ కట్నాలు కానీ మనకి చెబుతున్నదేమిటి? ఆనాటినించీ ఈనాటిదాకా మన సమాజంలో స్త్రీని మగవాడు ఎంతగా పీడించాడూ అని. ఏ పేరు పెట్టినా, ఏం చేసినా నష్టపోయింది స్త్రీ జీవితమే. ఈ నాడు కట్నాలు ఏం చేస్తున్నాయో ఆనాడు కన్యాశుల్కమూ అదే చేసింది. అందువల్ల కన్యాశుల్కం నాటిక ఆ రోజుల్లో ఎంత సమకాలీనమైందో ఈ రోజుల్లో కూడా అంతే! అదే వ్రాశాను. నేను వ్రాసిన దాన్ని ఎవరూ అంగీకరించాల్సిన అవసరం లేదు. ఇది నా వాదన కాదు, నా అభిప్రాయం మాత్రమే అని కూడా వ్రాశాను.

రోడ్డుమీద ట్రాఫిక్ ఎక్కువగావుంది. కార్లు ఒకదాని వెనుక ఒకటి చాల నెమ్మదిగా నడుస్తున్నాయి. నా ఆలోచనలు అంతకన్నా వేగంగానే నాలో పరుగు లెదుతున్నాయి. రోజులు మారాయి. కట్నాలు తీసుకోవటం పూర్వం, ఇప్పుడు కాదనుకుని మనల్ని మనం మోసం చేసుకోవటమూ భావ్యంకాదు. ఎందుకంటే ఈ రోజుల్లో తీసుకుంటున్నంత పెద్ద మొత్తాలు ఏనాడూ వినీవినీ ఎరుగం. ఈ సభ్య ప్రపంచంలో ఇంకా బ్రతుకుతున్న పెద్దమనిషి దానికిచ్చిన జవాబు, మరి ఇన్‌ఫ్లేషనూ కాస్ట్ ఆఫ్ లివింగూ పెరగలేదూ అని. అంటే అవి ఒక్క మగ పెళ్ళివారికే పెరిగాయ న్నమాట. ఆడపెళ్ళివారికి కాదు. కులాలనిబట్టి ఈ రోజు కట్నాలు కొన్ని లక్షల నించీ కోట్ల దాకా వున్నాయంటే, మా బ్రెండాలాటివారికి ఎలా చెబుతాం. బ్రెండా తన పెళ్ళికి తనూ, భర్త క్లిఫ్ పెళ్ళి ఖర్చులు ఇద్దరూ కలిసి ఎలా పంచుకున్నారో చెప్పిందికూడా. అంతేకాదు ఇటు కట్నాలు తీసుకోవటమే కాకుండా సాఫ్ట్‌వేర్‌లో డిగ్రీకూడా కావాలిట ఈకాలపు మగమహారాజులకి. ఎందుకంటే కట్నం అమెరికా వెళ్ళటానికి ఖర్చులకి. సాఫ్ట్‌వేర్ డిగ్రీ భార్య ఉద్యోగంతో బాంక్ బాలన్స్‌కి.

ఇంటికివచ్చిపేపర్ ముందేసుకుని కూర్చున్నాను. శ్రీమతి పక్కనే వచ్చి కూర్చుని అంది, "ఇవాళ చికాగోనించీ సరళ ఫోన్ చేసింది. వాళ్ళ చెల్లెలికి పెళ్ళి కుదిరిందిట"

"ఇండియాలో కదూ ఆ అమ్మాయి వుండేది " అన్నాను.

"అవును. హైద్రాబాద్‌లో. వాళ్ళ నాన్నకూడా రిటైరయారుట. సరళ చెల్లెలు సరోజని చదివించే సరికే ఆయనకి కష్టమయిందిట. అసలే మధ్య తరగతి జీవితాలు మరి. కట్నం ఏమి తీసుకోమన్నారుట!"

నాకు ఆశ్చర్యం వేసింది. "అంటే ఈ విషయంలో మనదేశం బాగుపడు తున్నదన్నమాట. దటీజ్ గుడ్!" అన్నాను, రేపు బ్రెండాతో మాట్లాడేటప్పుడు సమర్ధించుకోటానికి ఒక మంచి కబురు తెలిసిందనే ఆనందంతో.

"కట్నం లేదని పేరుకేగానీ, మగ పెళ్ళివాళ్ళే ఏ కల్యాణ మండపంలో పెళ్ళి చేయాలో, డెకరోషన్లూ కాటరింగులూ ఎవరికివ్వాలో, లాంఛనాలు ఏమి వ్వాలో లెఖ్ఖలేసి చెప్పారుట. మాటిమాటికీ మేం కట్నం తీసుకోవటం లేదు అని గుర్తు చేస్తూ, మిగతావాటికి ఘనంగా ఖర్చు చేయిస్తున్నారుట. పది పన్నెండు లక్షల దాకా అవుతుందని మొదటి అంచనా!"

అది విని ఒక్కసారిగా నిర్ఘాంతపోయాను. ఇదో కొత్త తరం పద్ధతి అన్న మాట. కన్యాశుల్కం కన్యలని శూలంలా పొడిచింది. అవి పోయి కట్నాలు వచ్చా యి. కట్నాలు కన్నెల జీవితాలని కిరసనాయిలు పాలు చేశాయి.

కట్నాలతో పాటూ సాఫ్ట్‌వేర్ డిగ్రీల సారెలూ, కట్నం లేకుండా కట్నా లని మించిన ఈ గిట్నాలూ!! మనం ఎక్కడికి పోతున్నాం!

ఏమో నాకూ తెలీదు.

* * *